కథా నిలయం
3913
శ్రీకాకుళం

# జై

పాతికేళ్ళకిింద మనదేశం రిపబ్లిక్ అయిందని ఆరోజు పండుగదినం. ఆ పండుగను ఘనంగా, వైభవంగా, కోలాహలంగా చేసుకుంటున్నారు — అట్లా చేసుకోగలవాళ్ళందరూ.

ఢిల్లీ మహానగరంలో రాష్ట్రపతి నివాసంనుండి ఇండియా గేట్‌దాక వున్న సువిశాలమయిన మార్గం పేరు రాజపథం. ఆ పథానికి అది పెద్ద పండగ దినం.

విజయచౌక్ అనే ఆ సుందరమైన కూడలీ, రాజసంతో రాజిల్లే ఆ రాజ పథమూ— లుట్యెన్స్ దొర కేవలం ఈ రిపబ్లిక్ దినోత్సవ నిమిత్తమే ఊహించి, రూపకల్పన చేశాడా అన్నంతగా—ఆ చోటూ ఆ పండగా చెట్టా పట్టాలేసుకుని వుంటాయి.

అంత చలిలోనూ ఆ ఉదయం—

ఆ పథానికిటూ, అటూ కిక్కిరిసిన లక్షలాది జనం.

పిల్లలూ, వారి తలిదండ్రులూ, తలిదండ్రులు కాని దంపతులూ, దంపతులు కాని స్త్రీ పురుషులూ, గుమాస్తాలూ, వ్యాపారస్తులూ, ఆఫీసర్లూ అక్కడ.

అతిథులూ, ప్రతినిధులూ, సభ్యులూ, రాయబారులూ, ఇంకా ఇంకా పెద్దలూ, వెలుగు దీపాలూ, నిన్నటి సూర్యుళ్లూ, రేపటి చంద్రుళ్లూ కూడా కాస్త 'దూరం'గా అక్కడే...

ఉత్సాహంగా జనం.

కుతూహలంగా జనం.

ఉవ్విళ్ళూరుతూ జనం.

పరవళ్లు తొక్కుతూ జనం.

జనం – జనం, అంతా జనం.

సరిగ్గా తొమ్మిది గంటలకు -

మొదలయింది పెరేడ్.

అందమైన దుస్తులు

అద్భుతమైన బ్యాండ్ వాయిద్యాలు,

తప్పెటలు, తాళాలు

తాళాలకు తగ్గ అడుగులు

అడుగులతో బాటు కదిలే దుస్తులు, మెదిలే పతకాలు

దుస్తులకు, పతాకాలకు కొత్త మలామాపూస్తూ సూర్యుడి కిరణాలు.

కిరణం విరియగా కురిసిన రంగుల్లో స్నానాలు చేస్తున్న పతాకాలు.

మొదలయింది పెరేడ్.

♦ ♦ ♦

[అదే నగరంలో-

కరోల్బాగ్ ప్రాంతంలో నాలుగో నెంబరు బ్లాక్‌కూ- సత్‌నగర్‌కూ మధ్య ఒకవీధి. దాని పేరు వాల్మీకి వీధి. ఆ వీధిలో రామాయణం చదవరు కాని రాముడి బొమ్మలుచేస్తారు; కృష్ణుడి బొమ్మలూ చేస్తారు. వినాయకుడు, శివుడు, దుర్గ, బొజ్జ సన్యాసి, ఫ్రాక్ వేసుకుని చేత్తో పూలగుత్తి పట్టుకున్న కలవారి అమ్మాయి కామాక్షి – వంటి అన్ని బొమ్మలూ చేస్తారు.

అయినా బొమ్మలకి అంత గిరాకీ ఏముంటుంది గనుక ? ఆబొమ్మలు చేసేవారి ఆకలిని తీర్చవు. మధ్య తరగతి అనబడే త్రిశంకు స్వర్గపు అట్టడుగు మెట్టు పట్టుకు వేళ్ళాడే అక్కడి జీవితాలు వడ్డించిన విస్తర్లు అసలు కావు; అందులో చాలమందివి జీవితపు జాగిలం చింపిన విస్తర్లు.

చదరపు గజానికి పదిమంది వసించే ప్రాంతం అది. ఆ పదిమందితో బాటు పందులూ, మేకలూ, కోళ్లూ, కుక్కలూ సహ జీవించే సోషలిస్టు సామ్రాజ్య భాగమది. మురికికి, మురికి కానిదానికీ సరిహద్దులు లేని కాలనీ అది. లేచినదాదిగా నిదురించే దాకా నోటిలోకి 'రొట్టె' ముక్కకోసం వెతుక్కునే వాళ్ల నిలయం అది,

అక్కడి అనేకానేక ఇళ్లల్లోని కిక్కిరిసిన పరిమితాపరిమిత కుటుంబాల్లో-

ఒకదానికి చెందిన అమ్మాయి; ఆరేళ్ళది; పేరు మున్నీ. పెద్దకళ్లు; చింపిరిజుత్తు; వారాని కొక్కరోజు మాత్రమే వాళ్లమ్మ ఆపనూనె రాస్తుంది. ఆ అడివికి. వాళ్ల నాన్న ఆ వీధి మొగదల సైకిల్ రిపేర్లు చేస్తుంటాడు మున్నీ కో అక్కయ్య, తమ్ముడు వున్నారు. అందరూ తలో విధంగా ఇంటికి కావలసిన వాటిని సంపాదిస్తుండడమే వారి హాబీ !]

*　　*　　*

మొదలయింది రిపబ్లిక్ డే పెరేడ్.

లౌడ్ స్పీకర్ల ద్వారా ఖంగుమని శ్రావ్యంగా చెబుతూంది డీమెల్లో కంఠం.

"అదిగో ఎర్రటి కుచ్చు టోపీలతో, మెరిసే కరవాలాలతో భువికి దిగివచ్చిన భాస్కరుల వలె, ఠీవిగా నిటారుగా హిస్సార్ రెజిమెంట్ అదిగో వస్తుంది! గతసంవత్సరం శత్రుదేశం మనమీద దాడి చేసినపుడు లోన్‌వాలా విభాగంలో ఈ దళం వారు అత్యంత సాహస పరాక్రమాలతో...."

ఆ పదాతి దళం, వారి బ్యాండ్ డ్రమ్స్ కనుగుణంగా 'మార్చ్' చేస్తూవచ్చింది.

చప్పట్లు, ఆనందం కనులపండుగ.

[మొదలయింది మున్నా దైనందిన పెరేడ్.

మున్నాతో పాటు చిన్నా.

చిన్నాతో పాటు టింకూ.

వాళ్లతో బాటు దుర్గా, రాధా, మీరా.

మార్చ్ పాస్టులు లే వక్కడ...

ఎప్పటి కప్పుడు మార్చ్ ప్రజంట్ లే....

నడక పరుగూ కలిసిన మార్చ్ అది.

అందరి మొహాల్లోనూ ఆతురత.

అందరి కళ్ళల్లోనూ కొశ్చెన్ మార్కులు.

గల గల నవ్వులు మాటలు.

కేకలు, కేరింతలు, వాగ్వాదాలు.

ఎందుకోసమో ఎదురుచూపులు-

జీవితపు బరువుకింద విరితావులు...]

"అదిగో అదిగో... సగర్వంగా నిగనిగ మెరిసే 'వైజయంత' టాంక్ అదిగో- వైరి హృదయాలలో విజయతాండవం అదే, అదే!... దానికి కాస్త వెనుకగా విజయగర్వంతో నెమ్మదిగా ముందుకు సాగుతున్న దేవిటో తెలుసా? తెలియకేం... మీ అందరికీ తెలుసు. గత వర్షపు పోరాటంలో శత్రువుల్ని చిత్తుచేసిన సాటిలేని మేటి 'నాట్' విమానం అది".

గర్వం, ఆనందం, విజయోత్సాహం, కరతాళధ్వనుల వర్షం "ఆ వెనకాల పారాట్రూపర్ల జంట... వారి ననుసరించి ఒయ్యారపు ఒంటెల మీద రాజసంతో సాగివస్తున్న ఆ జైసల్మార్ రిసాలా దళం..."

లక్షలాది ప్రేక్షకుల కళ్ళల్లో రిపబ్లిక్ పండుగ వెల్గులు ...

[వెల్గులేతప్ప చీకట్లు తెలియని వయసు పిల్లలు మున్నా, చిన్నా, మీరా, రాధా....

ఆర్.కృష్ణనూ, మాన్యుయెల్ శాంటానాల టెన్నిసాటను తిలకిస్తున్న ప్రేక్షకుల తలలవలె ఆ చిన్నారి పొన్నారి తలలు అటూ ఇటూ కదులుతున్నాయి.

ఆ కళ్లు ఎటో ఎటో, ఎందుకోసమో చూస్తున్నాయి.

"దుర్గా ! నిన్న నేను పదిపైసలు పెట్టి ఐస్క్రీమ్ కొనుక్కుతిన్నాను, తెలుసా.... ఎంత బావుందో..."

సిద్ధులయినవారికే సాధ్యమైన రీతిలో — పెదవులమీదకు ఐస్క్రీమ్ రుచిని తెప్పించుకుని నాలుకతో చప్పరిస్తున్న మిగతా పిల్లలు.

మరుక్షణం ఆతురతతో ఎదురుచూపులు]

మళ్ళీ లౌడ్ స్పీకర్లో అదే కంఠం.

మధుర గంభీరమైన స్వరం.

"మనదేశం ఎంతగొప్పది! మన కళలు ఎంత గొప్పవి! మన నృత్య రీతులలో ఎంత వైవిధ్యం, ఎంత చైతన్యం, ఎంత సౌందర్యం!! వాటన్నిటి ప్రతీకగా ఆ గుజరాత్ దళంవారి 'గర్భా' నృత్యపు సొంపులు చూడండి..."

రంగు రంగుల వలువలు ! కమ్మ కమ్మని గీతాలు; లయతప్పనీ లాస్యపుటడుగులు.

"వీరరసం తొణికే ఆ నాగా వీరుల నృత్యం తిలకించి పులకించండి ! ..."

డబర డబర డబ్ ! డబ్; డబ్, డబ్ !

ఎరుపు నలుపు చారల బట్టలు, రంగు ఈకల కిరీటాలు, గవ్వల హారాలు, భేరీలు, నగారాలు, తప్పెట్లు....

ముడులు పడిన జడలు ఎగురుతుండగా గతితప్పని శివుల తాండవాలు...

['బెలూన్లు- ఈలలు- బొమ్మలోయ్' అని అరుస్తూ శ్రావణ మేఘంలా వెళ్తున్నాడు వాడు.

వాడికేసి చాతకపక్షుల్లా, చూస్తూ వాళ్లు—

వాళ్ళకు ప్రకాశికా కాల దూరంలో వున్న బొమ్మలు.

ఆ చూస్తున్న కళ్లలో మెరవని మెరుపులు.

ఆ చిన్నారి గుండెల్లో విరియడానికి భయపడుతున్న కోర్కెలు ..

ఈలోగా —

'అదిగో ద్వారక !'

'అదిగో అక్కడ-'

శ్రీకృష్ణుడు- శివుడు- యముడూ- లక్ష్మి- లాటరీలో లక్ష రూపాయలు, అన్నీ కలసి-

అదిగో అక్కడ...

ఆశ్చర్యం— ఆనందం- ఆతురత కలిసిన పరుగులు మున్నా మీరా చిన్నా దుర్గా రాధా టింకూలు ;

"అదుగో మన జాతి రక్షణ నిమిత్తం ఉరకలువేస్తున్న యువతరం! ఆ ఎన్. సి. సి. కేడెట్ల చూపులో అ దీక్ష, నడకలో ఆ ఉత్సాహం- గమనించండి-"

[నడకలు కావవి పరుగులు
పదిమందికన్న ముందుగా
గమ్యం చేరుకుంది మున్నా
ఏమా ఉత్సాహం-
గమనించుడు, గమనించుడు !]

"వారేవారే మన సరిహద్దు రక్షక దళాలు. ఆ వెనుక వస్తున్న అలంకరించబడిన శకటాలలో మొదటిది ప్రగతి పూలరథం. అందులో ఎంత విన్నాణం- ఎంత సోయగం..."

లక్షలాది జనతా మనుసులనిండా పూలజల్లులు.

[అదే, అదే- అసలు విషయం అదే.
నడిచేది, నడిపించెడిదీ అదే.
ఆగేదీ, ఆగించేదీ అదే.
పరుగెత్తేదీ, పరుగెత్తించేదీ అదే.
తెలుగు సినిమా వెనుక నవలవలె
దాని వెనకాతలే మున్నా ]

నడిచినా ఆగినా, పరుగులిడినా రెండు చేతులతోనూ తట్టను వదలడం లేదు మున్నా 'ఆ' చోటునుంచి కదలనివ్వడం లేదు.

"చూచారా, చూచారా, ఆకాశంలో మన శాబర్ జెట్లు, నాట్‌లు, హంటర్లు, మిగ్‌లు ఎంచక్కటి 'ఫార్మేషన్'లలో దూసుకు వస్తున్నాయో... మన స్వేచ్ఛాకాశంలో అవి ఎంత గర్వంగా ఎగురుతున్నాయో మన దృఢ నిశ్చయానికి, మన ఉన్నత ఆశయానికి అవి ప్రతీకలు."

మెడలు సారించి ఆకాశంకేసి చూస్తూ పెద్దలూ, పిన్నలు రెప్పలార్పకుండా చూస్తూ లక్షలాది కన్నులు.

[ఆ అదిగో...

అయిపోయింది.

ఎంత, ఇంకొక్క క్షణం.

మున్నా కాక్షణం తెలుసు.

దానికోసమే ఈ పడిగాపులు

పడుతుంది, పడుతుంది

చేతిలో తట్ట నిండుతుంది.

అమ్మ చాల సంతోషిస్తుంది.

'మేరీ ప్యారీ మున్నా !' అని ముద్దు చేస్తుంది.

ఆ ! ఆ ! ఆ ! ]

"ఇదిగో ఇటు - రాష్ట్రపతి నివాసపు శిఖరాల మీదుగా బయలుదేరి మూడు రంగుల పొగలను చిమ్ముతూ- ప్రళయకాల ప్రభంజనాలవలె దూసుకొస్తున్న ఆ విమానాలను- ఆకాశంలో డేగలవలె విహరిస్తున్న ఆ ధీరులను చూడండి! మన గమ్యమంత ఎత్తుగా, మన అభ్యుదయమంత వేగంగా స్వేచ్ఛాకాశంలో ధైర్యసాహసాల రంగవల్లులు తీర్చిదిద్దుతున్న ఆవీరుల్ని, వారి విమానాలను చూడండి.... అవిగో అవి ఎగిరాయి; ఎంతో ఎంతో ఎత్తుకు

ఎగిరాయి. ఉల్కల్లా దిగుతున్నాయి. రివ్వున అందంగా దిగి, 'సెల్యూటింగ్ బేస్' వద్ద సెల్యూట్ చేసి–వేగంగా పైకెగిరి, వేవేగంగా– దూరంగా, దూర దూరంగా వెళ్ళి ఆకాశంలోకి వెళ్లి, మేఘంలో మేఘమై, నక్షత్రంలో నక్షత్రమై కలిసిపోతున్నాయి... చూడండి మైడియర్ కంట్రీమెన్– ఎద ఉప్పొంగేలా చూడండి !"

[ఆ !

అమ్మయ్య !!

ఆ తట్ట నిండింది.

భక్తుడికి వరం ప్రసాదించిన భగవంతుడిలా, చిద్విలాసంగా నడుచుకుంటూ, ముందుకు మున్ముందుకు, దూరంగా దూర దూరంగా వెళ్లిపోయింది మున్నా ముందుండిన గేదె.

పేడ నిండిన తట్ట పట్టుకుని ఆనందంతో ఎగురుకుంటూ ఇంటికి పరుగు తీసింది మున్నా !]

జై [?] ! !

— o —